RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 157 | మే 16, 2025 | వెల : రూ.3-00



ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతాం

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

4లో..




## ఆ 'బంధాలతో' 'బంధన్' సేఫ్?

■ రూల్స్ ఫాలో కాకున్నా అక్కడ మాత్రం ముందు..

■ ప్రైవేటు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు

**వేద న్యూస్, హన్మకొండ :**

వైద్యారోగ్య శాఖ, ప్రభుత్వ నిబంధనలు అనుసరించడంలో వెనుకబడి ఉండే సదరు ఆస్పత్రి వారు.. వారికి నెల నెలా అమ్యామ్యాలు ముట్టజెప్పడంతో పాటు వారిని ప్రసన్నం చేసుకోవడంలో అందరికంటే ముందు ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆస్పత్రిలో క్షమించరాని నిర్లక్ష్యం జరిగినా, ప్రాణం పోయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకెళితే.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రి 'బంధన్'.. లో అర్హత, అనుభవం లేని వైద్యులు ట్రీట్‌మెంట్ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో ఆస్పత్రిలో జరిగిన తప్పిదంపై బాధితుడి ఫిర్యాదుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. తాజాగా ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యపూరిత ట్రీట్‌మెంట్‌తో ఓ వ్యక్తి ప్రాణం కోల్పోయారు. సదరు ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం పట్ల నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు కచ్చితంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





## సరస్వతీలోకి పుష్కరుడి ఆగమనం

■ త్రివేణి సంగమం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం

■ స్నానమాచరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు.. సరస్వతీ విగ్రహం ఆవిష్కరణ

**వేద న్యూస్, భూపాలపల్లి జిల్లా :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో త్రివేణీ సంగమంలో సరస్వతి పుష్కరాలను గురువారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు స్నానమాచరించారు. అనంతరం సరస్వతి నదికి హారతి ఇచ్చారు. ఇక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతి దేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన పుష్కరాలు ఈ నెల 26వ తేదీతో ముగియనున్నాయి. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతి నదికి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఇక ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకూ సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. కాగా సరస్వతి పుష్కరాల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.35కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ప్రతి రోజు సగటున లక్షన్నర మంది భక్తులు పుణ్య స్నానమాచరించేందుకు వస్తారని దేవాదాయ శాఖ అంచనా వేస్తోంది.







## 20న సమ్మెలో 'జీ-445' పాల్గొనదు..

■ బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు శశి కుమార్

**వేద న్యూస్, హన్మకొండ :**

ఈ నెల 20న జరిగే సమ్మెలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్(రిజిస్ట్రేషన్ నెంబర్ G-445)పాల్గొనదని అఖిల భారత విద్యుత్ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నే శశి కుమార్ (తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రిజిస్ట్రేషన్ నం.జీ-445) గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశంలోని కొన్ని కార్మిక సంఘాలు కార్మిక నియమావళికి సంబంధించి మే 20న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించాయి. కాగా, ఈ సమ్మెలో భారతీయ మజ్దూర్ సంఘ్ పాల్గొనదని స్పష్టం చేశారు. 2019, 2020లలో దేశంలో అమలులో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో భారత ప్రభుత్వం 4 కొత్త కార్మిక చట్టాలను రూపొందించింది. వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం- పని పరిస్థితుల కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020. వీటిలో రెండింటినీ బీఎంఎస్ స్వాగతిస్తోందని వెల్లడించారు. ఐఆర్ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్ కోడ్ 2020లో అవసరమైన సవరణలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ నెల 20న సమ్మెలో పాల్గొనకూడదని యూనియన్లకు విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## కళాశాల నూతన భవనానికి శంఖుస్థాపన

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ నగరంలోని కృష్ణ కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారదలతో కలసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాల క్రితం బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా కళాశాలగా మంచి గుర్తింపు ఉన్న కృష్ణ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద సుమారు 5 కోట్ల రూపాయలతో మూడు అంతస్తుల్లో 15 తరగతి గతులతో పాటు 60 టాయిలెట్లను నిర్మిస్తున్నందుకు వారిని మంత్రి అభినందించారు. దీనితోపాటు ప్రభుత్వ పాఠశాలను సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో సీఎస్ ఆర్ క్రింద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల భవనానికి అవసరమగు మరమ్మత్తుల కొరకు తన నిధులు కేటాయిస్తానని, అందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో వరంగల్ ను రెండవ రాజధానిగా చేయుటకు గాను కృత నిశ్చయంతో ముందుకెళుతున్నట్టు తెలిపారు.

బల్దియా ఆధ్వర్యంలో శాశ్వతంగా డ్రైన్ నిర్మాణం చేపడతామని నగర మేయర్ ప్రకటించడం పట్ల మంత్రి అభినందించారు. భవిష్యత్తులో కృష్ణా కళాశాల వరద నీటి ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యల్లో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ క్రింద నుండి డ్రైన్ నిర్మాణానికి డి పి ఆర్ సిద్ధం చేయాలని, రైల్వే అధికారులతో సంప్రదించి పరిష్కారం చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ చూపి అరవిందో ఫార్మా వారితో పలుమార్లు సంప్రదించడం వల్ల ఈరోజు సిఎస్ఆర్ కింద ఐదు కోట్ల రూపాయలతో కళాశాల భవనం నిర్మించడం సాధ్యమైందని అన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థలతో సంప్రదించి త్వరలో ప్రభుత్వ పాఠశాలను కూడా సిఎస్ఆర్ క్రింద పునర్నిర్మానం చేయుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా షిఫ్టులవారీగా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోనున్నట్లు తెలిపారు. కళాశాల భవన నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ప్రతినిధులను ను కలెక్టర్ కోరారు. అనంతరం పదవ తరగతిలో రాష్ట్రంలో ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థిని మంత్రి, మేయర్, కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ లు చింతాకుల అనిల్ కుమార్, కావేటి కవిత, బస్వరాజు కుమార స్వామి, సురేష్ జోషి, అరబిందో ఫార్మా డైరెక్టర్ సదానంద రెడ్డి, జిల్లావిద్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, కళాశాల ప్రిన్సిపల్ శరదృ తి, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారులతో మేయర్ సమీక్ష

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

అనధికారిక లేఅవుట్లు వెలియకుండా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో మేయర్ అనధికారిక లేఅవుట్లు వెలియకుండా చర్యలు, ఎల్ ఆర్ ఎస్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారుల సౌకర్యార్థం అనధికార ప్లాట్లు, లే అవుట్ల ను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం 25శాతం రీబెట్ తో ఈ నెల 31 వరకు గడువును పొడగించిందని, ఈ సువర్ణ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవానెలా ప్రోత్సహించాలని అధికారులను సూచించారు. ఇప్పటివరకు 30,500 దరఖాస్తులు స్వీకరించడం ద్వారా రూ.130.50 కోట్ల ఆదాయం బల్దియా కు సమకూరుందని, రెగ్యులేషన్ రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు త్వరితంగా ప్రొసీడింగ్స్ అందజేయాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో అనధికారిక

మిగతా 4వ పేజీలో..





4లో..

## ట్రాన్స్ జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి..

■ ఎంపీ డా.కడియం కావ్య

వేద న్యూస్
శుక్రవారం, మే 16, 2025

# ప్రమాదకరంగా వ్యవసాయ బావులు..!

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



వేసవికాలం వచ్చింది అంటే సరదాగా ఈత కొట్టడం ఈత నేర్చుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యవసాయ బావులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. అనేకమంది తమ పిల్లలు వ్యవసాయ బావిలో ఈత నేర్పించడం పరిపాటిగా సాగుతుంది. ఇటీవల కాలంలో వ్యవసాయ బావుల్లో ప్రమాదవశాత్తు పడిపోయి లేక ఈత రాకపోయినా బావులలో దిగి చనిపోతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. రంగారెడ్డి జిల్లా పట్టణ శివార్లలో ఈత రాకపోయినప్పటికీ బావిలోకి దిగి నీరు తెచ్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోయి ఇద్దరు ముగ్గురు మరణించిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ బావుల్లో నీరు సక్రమంగా లేకపోవడం వ్యవసాయ సాగుకు సరిపడా నీరు అందించలేకపోవడంతో అనేకమంది రైతులు తమ పంట పొలాలలో బోర్లు వేసుకుంటున్నారు. వందల కొద్ది అడుగుల లోతులో బోర్లు వేస్తూ తమ పంట పొలాలను సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అనేక మంది రైతులు వ్యవసాయ భావుల గురించి పట్టించుకోవడం మరిచిపోయారు. గతంలో రైతులు వ్యవసాయ బావులకు ప్రతి సంవత్సరము మరమ్మత్తులు చేయించడం రక్షణ ఏర్పాట్లు చేసుకునేవారు. బావిలో దిగడానికి మెట్ల సౌకర్యం కూడా ఏర్పాటు చేసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. బావుల చుట్టూ చెత్తాచెదారం కంప చెట్లు పెరిగి ఉండడం దిగడానికి కూడా అవకాశం లేకుండా ప్రస్తుత బావులు దర్శనమిస్తున్నాయి. గతంలో మెట్ల సౌకర్యం వల్ల బావిలోకి దిగి నీరు తెచ్చుకునేవారు. ప్రస్తుతం వ్యవసాయ బావులకు ఆ పరిస్థితులు లేవు అనేక ప్రాంతాలలో వ్యవసాయ బావులు శిథిలావస్థకు చేరుకొని ఉన్నాయని తెలిసి తెలియక బావిలో దిగే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో అనేకమంది జారి పడిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈత సరదా వల్ల అనేకమంది మరణిస్తున్నారు. వేసవిలో పశువులు సైతం నీటి కోసం బావి దగ్గరకు వెళ్లి అందులో పడి మరణిస్తున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. గత ఏడాది రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతంలో పశువులు వ్యవసాయ బావిలో పడిపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

**– తల్లిదండ్రుల జాగ్రత్తలు అవసరం**

వేసవికాలం రోజులలో వ్యవసాయ పొలాల వద్ద ఎవరు ఉండరు. వ్యవసాయ పనులు పూర్తయిన నేపథ్యంలో వ్యవసాయ భావుల వద్ద కూడా ఎవరు కనిపించరు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను వ్యవసాయ బావుల వద్దకు ఒంటరిగా పంపడం శ్రేయస్కరం కాదు. ఈత వచ్చినప్పటికీ బావిలోకి దిగి తిరిగి పైకి రావడం సాధ్యమయ్యే పని కాదు వ్యవసాయ భావి ఒడ్డులు కూడా సక్రమంగా ఉండవు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పాత బావులు చాలా ప్రమాదకరంగా ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి అదేవిధంగా వ్యవసాయ బాగుల వద్ద విద్యుత్ మోటర్లు కూడా ఉంటాయి షాక్ తగిలి మృతి చెందే అవకాశం కూడా ఉంటుంది తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని ఒంటరిగా బావుల వద్దకు పంపవద్దని అభిప్రాయపడుతున్నారు.

# పీవీ విగ్రహం ఏర్పాటు పట్ల హర్షం



**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ భవన్ లో దివంగత మాజీ ప్రధానమంత్రి పాములపర్తి వెంకట నరసింహారావు ( పీవీ నరసింహారావు ) విగ్రహ ఏర్పాటుకు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు అన్నారు. గురువారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణలకు కలిపి ఒకే అధికారిక భవన సముదాయం ఉందని ఈ ప్రాంగణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం పక్కనే పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని దానికి స్థలం ఇవ్వాలని కోరుతూ పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ 2024 ఏప్రిల్ లో న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ కు లేఖ రాసిందని గుర్తు చేశారు. ఎన్ఎండిసి ప్రతిపాదనను ఢిల్లీ అర్బన్ ఆర్ట్స్ కమిషన్కు పంపిందని దీనిపై మార్చి 27న ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ సమావేశం చర్చించి నిర్ణయం తీసుకుందని తెలిపారు. నిజానికి ఢిల్లీలో పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలని టాల్కాటోరో రోడ్డుకు ఆయన పేరు పెట్టాలని, కోరుతూ పీవీ కుటుంబ సభ్యులు 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్ కు లేఖ రాశారని, కానీ ముందుకు సాగలేదని కేసీఆర్ హయాంలోనూ తెలంగాణ భవన్ లో పివీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కుటుంబ సభ్యులు లేఖ రాశారని ఆయిన అమల్లోకి రాలేదని ఇప్పుడు ముందడుగు పడిందని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఫైల్ ను చకచకా నడిపించి పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.




## హైదరాబాద్, ముంబైలలో
# ఈడీ సోదాలు

**వేద న్యూస్, డెస్క్:**

ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది.

ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

# ఘనంగా నీలిమ బర్త్ డే వేడుకలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు కోటా నీలిమ జన్మదిన వేడుకలు తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు కోటా నీలిమ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కోశాధికారి మంత్రి సునీల్, ప్రముఖ న్యాయవాది కానాల శ్యాంసుందర్రావు, దేవులపల్లి అశోక్ కుమార్, నర్వ రఘు, గూడా జయరాం, కాశీభట్ల కేశవ శాస్త్రి, తదితరులు పాల్గొని నీలిమకు శుభాకాంక్షలు తెలిపారు.

# షాపు యజమానిని కాల్చి చంపిన కస్టమర్!

**వేద న్యూస్, డెస్క్:**

సమోసా విషయంలో తలెత్తిన ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఈ దారుణ ఘటన జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే... రాకేశ్ అనే వ్యక్తికి ఫరూఖ్‌నగర్ ప్రాంతంలో టీ స్టాల్ ఉంది. ఈ నెల 12న పాత నేరస్తుడైన పంకజ్ తన అనుచరులతో కలిసి ఆ టీ స్టాల్ కు వచ్చాడు. ఈ క్రమంలో సమోసా విషయమై రాకేశ్‌తో ఘర్షణకు దిగాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పోలీసులు పంకజ్‌ను హెచ్చరించి అక్కడి నుంచి పంపేశారు. అయితే, ఆ తర్వాతి రోజు పంకజ్ తన అనుచరులతో కలిసి మళ్లీ రాకేశ్ టీ స్టాల్ వద్దకు వచ్చాడు. ఆ తర్వాత తనతో పాటు తెచ్చుకున్న తుపాకీతో రాకేశ్‌పై ఆరుసార్లు కాల్పులు జరిపాడు. అతడు చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫరూఖ్‌నగర్–ఝజ్జర్ రహదారిని దిగ్బంధించారు. వ్యాపారులు తమ షాపులను మూసివేసి నిరసన తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇక, స్థానికులు నిరసన తెలుపుతున్న ప్రాంతానికి చేరుకున్న పోలీసులు... వారిని సర్ది చెప్పారు.

# హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా సింగ

## – 'ఆవాస' పూర్వ విద్యార్థి కృష్ణ మోహన్‌రాజుకు సర్కారీ కొలువు

**వేద న్యూస్, జమ్మికుంట:**

సాధించాలనే పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరూ అనుకున్నది సాధించగలరని మాటల్లో చెప్పడం కాకుండా చేతల్లో చేసి నిరూపించారు జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం కేశవపురం పూర్వ విద్యార్థి సింగ కృష్ణ మోహన్ రాజు. సర్కారీ కొలువు సాధించాలనే సంకల్పంతో అకుంఠిత దీక్షతో పోటీ పరీక్షలకు సన్నద్ధమై.. ఎన్నో ఒడిదుడికులు ఎదుర్కొని.. ప్రైవేటు టీచర్‌గా కొన్ని రోజులు పని చేశారు. టీజీపీఎస్సీ(తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఇటీవల రిలీజ్ చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ రాజును స్నేహితులు, బంధువులు అభినందిస్తున్నారు.

సింగ మాధవీలత–భిక్షంరాజు దంపతుల తనయుడైన కృష్ణ మోహన్ రాజుకు.. చిన్న నాటి నుంచి పుస్తకాలంటే అమితమైన ఆసక్తి. ముఖ్యంగా మహనీయులు, గొప్ప వారి జీవిత చరిత్రలను ఇంట్రెస్ట్‌గా చదువుతుంటారు. ఈ క్రమంలోనే వారి నుంచి స్ఫూర్తి పొంది పోటీ పరీక్షలకు అకుంఠిత దీక్షతో సన్నద్ధమై.. సత్తా చాటారు. హన్మకొండ ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్, వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజీలో డిగ్రీ.. ఫాతిమా కాలేజీ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ, లష్కర్‌బజార్ ప్రభుత్వ కాలేజీ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ చదివారు. అనంతరం ప్రైవేటుగా అధ్యాపకుడిగా పని చేస్తూనే..ప్రభుత్వ కొలువు సాధించాలనే తపనతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. హుజూరాబాద్ శిశుమందిర్, జమ్మికుంట శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంతో పాటు బీమారం శివానీ హై స్కూళ్లలో ప్రైవేటు టీచర్‌గా వర్క్ చేస్తూనే.. కృష్ణ మోహన్ రాజు కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరయ్యారు.





**– గ్రేడ్–2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా కొలువు**

సర్కారీ నౌకరీ అనేది ప్రతి ఒక్కరి కలల కొలువు. కాగా, అందుకు చాలా శ్రమించాలనేది నిర్వివాదాంశం. పోటీలో నిలబడి తట్టుకుని విజయం సాధించాలనే చాలా అంటే చాలా కష్టపడి, ఇష్టపడి, ఎక్కడా నిరాశ, నిస్పృహలకు తట్టుకుని ఆశావాద దృక్పథంతో చదువుపైన దృష్టి సారించాలి. ఆ మేరకు కృష్ణ మోహన్ రాజు.. ఎంతో దీక్షతో చదివి.. చదువుకున్న విషయాలను సంపూర్ణంగా అవగాహన చేసుకున్నారని చెప్పొచ్చు. ఇటీవల రిలీజ్ చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల ఫలితాల్లో కృష్ణ మోహన్ రాజు 300 మార్కులకు 189.40 మార్కులు సెక్యూర్ చేసి సర్కారీ కొలువు సాధించడం విశేషం.

**– నా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తా: కృష్ణ మోహన్‌రాజు**

పరకాల హనుమకొండ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నా బాధ్యతలను నేను సక్రమంగా నిర్వర్తిస్తాను. హాస్టల్స్‌లో వసతుల కల్పనతో పాటు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారపదార్థాలు స్టూడెంట్స్‌కు అందేలా నా పరిధి మేరకు శక్తి వంచన లేకుండా పని చేస్తాను. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, వారి అభివృద్ధి నా శక్తి, పరిధి మేరకు కృషి చేస్తాను. ఆ మేరకు నా బాధ్యతలను నిర్వర్తిస్తాను.

# సంపాదకీయం

## ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు...


డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగిజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్-ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు.

ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి.

అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విధ్వారంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్- పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది.

# భారత విదేశాంగశాఖకు పాక్ జలవనరుల మంత్రిత్వశాఖ లేఖ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



సింధు నదీ జలాల ఒప్పందం రద్దు నిర్ణయం పునః పరిశీలించాలని పాకిస్థాన్ బుధవారం భారతదేశాన్ని అభ్యర్థించింది. పహల్గాం ఉగ్రదాడి తరువాతి దశలో భారతదేశం ఈ ఒప్పందం నిలిపివేసింది. దీనితో నెలకొన్న సంక్షోభం గురించి భారతదేశం తక్షణం పరిశీలించాల్సి ఉందని పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వశాఖ ఇప్పుడు భారత విదేశాంగ మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. ఈ లేఖను అత్యవసర ప్రాతిపదికన పరిశీలించాలని, ఇంతకు ముందటి నిర్ణయాన్ని సమీక్షించాలని ఇందులో తెలిపారు. సింధూ ఒప్పందంపై భారత్ కీలక నిర్ణయంతో నీళ్ల నిలిపివేత ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని జలాశయాల్లోకి క్రమేపీ నీరు తగ్గడం , ప్రధాన జల విద్యుత్ కేంద్రాలలో ఉత్పత్తి ప్రమాదకర క్షీణత దశకు చేరుకుంటూ ఉండటంతో పాక్ ఇప్పుడు భారత్‌తో దాదాపుగా కాళ్లబేరానికి వచ్చినంత పనిచేసింది. దయచేసి పరిశీలించండని కోరారు. ఒప్పందం నిలిపివేత తమ దేశానికి జల సంక్షోభం తెచ్చిపెడుతుందని ఈ లేఖలో పాకిస్థాన్ తెలియచేసుకుంది . సింధూ జలాల నిలిపివేత జరిగితే సింధూ నదిలో రక్తం పారుతుందని పాక్ మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. దీనికి స్పందనగా ఇటీవలే ప్రధాని మోడీ నీళ్లు నెత్తురు కలిసి ప్రవహించవని బదులు ఇచ్చారు. ఉగ్రవాదానికి ఊతం నిలిపివేసి, దీనిని నిరూపించుకుంటేనే సింధూ జలాల ఒప్పందం తిరిగి కుదురుతుందని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. 1960లో సింధూ ఒప్పందం కుదిరింది. దీని మేరకు పలు నదుల్లో ప్రవాహ వాటాలపై నిర్ణయం ఖరారు అయింది. పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేసేంత వరకూ, తమ దేశం అత్యంత వ్యూహాత్మకంగానే అంతర్జాతీయ ప్రామాణికలతోనే సింధూ ఒప్పందాన్ని అటకెక్కిస్తుందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణదీప్ జైస్వాల్ ఇటీవల తెలిపారు, ఇక పాకిస్థాన్ నుంచి ఇప్పుడు వెలువడ్డ లేఖపై భారత వివేశాంగ మంత్రిత్వశాఖ ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పటికైతే స్పష్టం కాలేదని అధికారులు తెలిపారు.

### బిఎస్‌ఎఫ్ జవాన్ ను సురక్షితంగా

# భారత్‌కు అప్పగించిన పాక్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ఏప్రిల్ లో అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు దాటి , పాక్ భూభాగంలోకి ప్రవేశించడంతో పాకిస్తాన్ రేంజర్లు అరెస్ట్ చేసిన బీఎస్ ఎఫ్ జవాన్ ను సురక్షితంగా మనదేశానికి అప్పగించారు. సరిహద్దు భద్రతా దళానికి చెందిన పూర్ణమ్ కుమార్ షాను బుధవారం అటారీలోని చెక్ పోస్ట్ వద్ద భారతీయజవాన్లకు పాక్ ఆర్మీ అప్పగించింది. 2025 ఏప్రిల్ 23న బిఎస్ ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షాను పాకిస్తాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం 10-30 గంటల ప్రాంతంలో అమృత్ సర్ లోని జాయింట్ చెక్ పోస్ట్ వద్ద భారతదేశానికి అప్పగించారు. అప్పగించ శాంతియుతంగా, ప్రొటోకాల్ ప్రకారం జరిగినట్లు బీఎస్ ఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. పూర్ణమ్ కుమార్ షా పాక్ భూభాగంలో ప్రవేశించినప్పుడు యూనిఫామ్ లో ఉన్నాడు. అతని చేతిలో సర్వీస్ రైఫిల్ ఉంది. 40 ఏళ్ల జవాన్ 17 ఏళ్లుగా బిఎస్ ఎఫ్ లో పనిచేస్తున్నాడు. అతడి స్వస్థలం పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ. జమ్మూకశ్మీర్ లోని పహల్గాం లో టెర్రరిస్ట్ ల దాడిలో 26 మంది పర్యాటకులు చనిపోయిన ఒకరోజు తర్వాత అంటే ఏప్రిల్ 23న పంజాబ్ లోని ఫిరోజ్ పూర్ లో విధులు నిర్వహిస్తున్న బిఎస్ ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా అనుకోకుండా సరిహద్దు దాటాడు. ఆ టెర్రరిస్ట్ దాడి వల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు హెచ్చడంతో జవాన్ అప్పగింతలో జాప్యం జరిగింది. జమ్మూకశ్మీర్ నుంచి గుజరాత్ వరకూ దాదాపు 2,323 కిలోమీటర్ల మేరకు భారత్ - పాక్ సరిహద్దు ను బీఎస్ ఎఫ్ జవాన్లు నిర్విరామంగా కాపాడతారు. గస్తీ సమయంలో బీఎస్ ఎఫ్ జవాన్లు పొరపాటున సరిహద్దు దాటడం, ఉభయపక్షాల మధ్య ఫ్లాగ్ మీటింగ్ తర్వాత అప్పగించడం సాధారణమే.

# మహిళలు రాఫెల్‌ను నడిపినపుడు ఆర్మీ లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వరు ?

**వేద న్యూస్, డెస్క్:**



భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానాన్ని నడపగలిగినప్పుడు, ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ (లీగల్) పోస్టుల్లో కొద్దిమంది మహిళా అధికారులు మాత్రమే ఎందుకు వున్నారని సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని నిలదీసింది. ఈ పోస్టుల్లో మహిళలు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ పోస్టులకు 50-50 నిబంధన వర్తించినప్పటికీ మహిళలను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించింది. ఇద్దరు మహిళా అధికారులు అర్షనూర్ కౌర్, ఆస్థా త్యాగి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ నెల 8న తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఆ ఇద్దరు మహిళా అధికారులు ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో వరుసగా 4, 5 ర్యాంకులు సాధించారు. పురుషుల కన్నా మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళలకు కేటాయించిన ఖాళీలు తక్కువగా ఉండటం వల్ల జెఎజి విభాగానికి తమను ఎంపిక చేయలేదని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేసే విషయంలో మహిళలు, పురుషుల మధ్య గల అసమానతలను ఈ పిటిషన్‌లో వారు సవాలు చేశారు. మొత్తం ఆరు పోస్టులకు గానూ మహిళలకు మూడు ఖాళీలే ఉన్నందున వారిని ఎంపిక చేయలేమని అధికారులు చెప్పారని తెలిపారు. భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానం నడపడానికి అనుమతి ఉంటే, జెఎజిలో ఎక్కువ మంది మహిళలను అనుమతించడంలో ఆర్మీకి కష్టమేముందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. జెఎజి పోస్టులు లింగభేదంతో సంబంధం లేని తటస్థ పోస్టులైనప్పటికీ.. మహిళలకు ఎందుకు తక్కువ పోస్టులు కేటాయించారని ప్రశ్నించింది. పురుషులు, మహిళలు ప్రాతిపదికన ఖాళీలను విభజించడం వల్ల అధిక అర్హత కలిగిన మహిళా అభ్యర్థులను ఆ పోస్టులకు తీసుకోనప్పుడు.. వాటిని లింగ తటస్థ పోస్టులని ఎందుకు పిలుస్తారని ధర్మాసనం ప్రశ్నించింది.

# మణిపూర్‌లో 10 మంది ఉగ్రవాదులు హతం

**వేద న్యూస్, డెస్క్:**

మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో అస్సాం రైఫిల్స్ యూనిట్ కి, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్మీ తూర్పు కమాండ్ ఎక్స్ లో పోస్ట్ చేసింది. "ఇండో-మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న చందేల్ జిల్లా ఖెంగ్‌జోయ్ తహసీల్‌లోని న్యూ సమతాల్ గ్రామం సమీపంలో సాయుధ క్యాడర్ల కదలికలపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలోని అస్సాం రైఫిల్స్ యూనిట్ మే 14న ఆపరేషన్ ప్రారంభించింది" అని తెలిపింది. ఆపరేషన్ సమయంలో జరిగిన కాల్పుల్లో 10 మంది ఉగ్రవాదులు మృతి చెందగా, భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. కోహిమాలో ఉన్న డిఫెన్స్ పిఆర్ఓ గురువారం ఉదయం పిటిఐతో మాట్లాడుతూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని,. అది ముగిసిన తర్వాత వివరాలను తెలియజేస్తామని తెలిపారు.




# పాక్‌కు టర్కీ సాయం

**వేద న్యూస్, డెస్క్:**


ఆపరేషన్ సిందూర జరిగీ జరగకముందే టర్కీకి చెందిన అత్యంత అధునాతన శక్తివంతమైన యుద్ధనౌక ఒకటి వచ్చి పాకిస్థాన్ కరాచీ రేవులో లంగరు వేసుకు నిలిచింది. ఇక భారతదేశానికి వ్యతిరేకంగా పాక్ సైన్యం సాగించిన దాడులకు వెనుక ఉండి ఈ ఇస్తాంబుల్ వాలా టర్కీ నేత ఎర్డోగాన్ అదేపనిగా సైనిక సాయానికి అర్రులుసాచాడు. ఆయనకు ఏ క్షణంలో భారత్ పట్ల ఆగ్రహం అంతకు మించిన అక్కసు నెలకొందో తెలియక విశ్లేషకులు తల్లడిల్లారు. ఇటీవల భారతీయ సైనిక బలగాలు ప్రయోగించిన అనేక క్షిపణులు నేలకూల్చిన డ్రోన్లలో అత్యధిక సంఖ్యలో టర్కీ డ్రోన్లు ఉండటం కీలకం అయింది. సాంకేతిక పరిజ్ఞానం సాధనాసంపత్తి ఏ మేరకు ఉందో తెలియదు కానీ టర్కీ విరివిగా పంపిన డ్రోన్లు అనేకం పతనం చెందాయి. పలు చోట్ల వీటి అవశేషాలు వెలుగులోకి వచ్చాయి. డ్రోన్లనే కాకుండా టర్కీవాలాలు వీటిని నడిపే నిర్వాహకులు ఛోదకులు ఇతర సాంకేతిక సిబ్బందిని కూడా తమ మిత్రదేశానికి తరలించి తాము సైతం ఈ భారత్‌పై యుద్ధంలో అని చాటుకోవడం ఇప్పుడు టర్కీ నేత కు భారత్ పట్ల నిండుకుని ఉన్న పరిపూర్ణ విద్వేషానికి ప్రతీక అయింది. 350కు పైగా డ్రోన్లను పాకిస్థాన్‌కు టర్కీ తరలించినట్లు గుర్తించారు. టర్కీ డ్రోన్ల శకలాల ఫోటోలను ఇప్పుడు భారతీయ సైన్యం అధికారికంగా మీడియాకు పంపించింది. ఏ వేదికపై అవకాశం దక్కినా భారత్‌కు వ్యతిరేకంగా నిందలు దిగడం, కశ్మీర్ పాక్ హక్కు అని చెప్పడం ఎర్డోగావ్ మిత్రకృత్యంఅయింది. ఇందులో భాగంగానే డ్రోన్లను పంపించారు. ఈ డ్రోన్లను తీసుకుని పాక్ వైమానిక బలగాలు భారతీయ భూభాగంపైకి దాడులకు తెగబడింది. ఇక ముగ్గురు నలుగురు టర్కీ వాలాలు కూడా డ్రోన్ల ఆపరేటర్లుగా ఉండి, భారత్ దెబ్బకు బలి అయ్యారు. పాకిస్థాన్ టర్కీ నుంచి బైరక్తర్ టిబి 2, ఇహా డ్రోన్లను పంపించింది. ఈ డ్రోన్లు దూర ప్రాంతాలకు చొచ్చుకువెళ్లగలవు. ప్రత్యేకించి భారతీయ సైనిక స్థావరాలను దెబ్బతీసేందుకు, లేదా అయోమయం సృష్టించేందుకు, సైనిక బృందాలకు సరఫరాల నిలిపివేతకు వాడతారని వెల్లడైంది.

# బస్సులో అగ్నిప్రమాదం.. ఐదుగురు ప్రయాణీకులు మృతి



**వేద న్యూస్, లక్నో:**

ఉత్తరప్రదేశ్ లక్నోలో గురువారం ఓ డబుల్ డెక్కర్ బస్సులో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం వల్ల ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు ప్రయాణీకులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. లక్నోలో కిసాన్‌పాత్ వద్ద ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ బస్సు బీహార్ నుంచి ఢిల్లీకి వెళు తుంది. ఈ ఘటనకు సంబంధించి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిపున్ అగర్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'బీహార్‌లోని బెగుసరారు నుండి ఢిల్లీకి వెళుతున్న ఓ ప్రైవేటు స్లీపర్ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ బస్సులో 60 నుచి 70 మంది ప్రయాణీకులున్నారు. అయితే ఈ అగ్నిప్రమాదం వల్ల ఐదురుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలతోపాటు, ఓ ప్రయాణీకుడు మృతి చెందారు' అని ఆయన అన్నారు.



## ఇంటర్ లో హెచ్‌సీఈసీ కోర్సు చేర్చాలి

**వేద న్యూస్, నాగూర్ కర్నూల్ :**


చరిత్ర పరిరక్షణ సమితి, నాగూర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు కావాలి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డికి ఇంటర్ విద్యలో హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్ధశాస్త్రం, రాజనీతి శాస్త్రం సబ్జెక్టు లతో) నూతన ఇంటిగ్రేటెడ్ గ్రూపు ప్రవేశపెట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తక్షణమే ముఖ్యమంత్రి, ఇంటర్మీడియట్ కార్యదర్శి తో మాట్లాడి కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. ఇంటర్ లో హెచ్‌సీఈసీ అనే నూతన గ్రూప్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు ఉడుతల బాలకృష్ణ గౌడ్, గంధం నాగరాజు, వి. రమేష్, జి. విష్ణు పాల్గొన్నారు..



## సోషల్ మీడియా శ్రీనివాస్ మరణం తీరని లోటు

**వేద న్యూస్, వర్ధన్నపేట :**

వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామనికి చెందిన పర్వతగిరి సోషల్ మీడియా కన్వీనర్ కట్ట శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పీసీసీ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ అన్నారు. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీను మరణం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సౌరం ప్రభాకర్, సౌరం అభిలాష్, పులిచేరి రాధాకృష్ణ, కోగిల సుధాకర్, వడ్లకొండ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి కుమార్, సోమారం గ్రామం మాజీ ఎంపీటీసీ లచ్చునాయక్, పర్వతగిరి మండల ఎస్సి సెల్ అధ్యక్షులు నరుకుడు రవీందర్ పాల్గొన్నారు.



## వైభవంగా మత్స్యగిరి స్వామి నాగవల్లి మహోత్సవం

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నాగవల్లి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించినారు. స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యా వచనము, ద్వాదశ ఆరాధనలతో వివిధ రకాల పుష్పాలతో పుష్ప యాగాన్ని దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, యాగ్నీకులు వీరవల్లి వేణుగోపాలాచార్యులు వేదమంత్రాలు మధ్య నిర్వహించినారు. మత్స్యగిరి స్వామి శ్రీదేవి భూదేవిల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి వేద పారాయణాలను చేసుకుంటూ దేవాలయం చుట్టూ పన్నెండు ప్రదక్షిణాలు చేసుకుంటూ ఊరేగించారు. ఒక్కొక్కసారి ఒక్కో వాయిద్యంతో రకాల వాయిద్యాలతో పన్నెండు సార్లు దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి పండిత సన్మానం చేశారు. పండిత సన్మానంతో శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు ముగిశాయని చైర్మన్ సామల బిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సైనా రెడ్డి, కృపాకర్ రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, శివరామకృష్ణ రెడ్డి ,మనీష్ రెడ్డి, కందగట్ల కోటేశ్వరరావు, సామల రవీందర్, కుసుమ శరత్ బాబు, దిండిగాల వంశీ, కాంబత్తుల ప్రకాష్, బాసాని వెంకటేశ్వర్లు, నామని శివ, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన కాంగ్రెస్..!

- **బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**



సంస్కృతి పేరుతో విదేశీయుల కాళ్ళు కడగడం సిగ్గుచేటు అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఇది తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి జరిగిన ఘోరమైన అవమానమని పేర్కొన్నారు. గురువారం ఆయన వీడియో ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మహిళలతో ప్రపంచ అందగత్తెల పోటీదారుల కాళ్ళు కడిగించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. కొండా సురేఖ, సీతక్క స్థానిక మంత్రులుగా ఉన్న ఓరుగల్లులో విదేశీ మహిళల కాళ్ల కడిగించి టవల్స్‌తో వారి కాళ్ళు తుడిపించి తెలంగాణ పరువు తీశారంటూ విమర్శించారు. రాణి రుద్రమదేవి, సమ్మక్క సారక్కలు, చాకలి ఐలమ్మ లాంటి వీరవనితలు పుట్టిన నెల మా ఓరుగల్లు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మహిళతో పాటు, దేశంలోని మహిళ లోకాన్ని ప్రపంచం ముందు అవమానపరిచిందంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందని పేర్కొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారులతో మేయర్ సమీక్ష

**మొదటి పేజీ తరువాయి**

లేఅవుట్లు వెలియకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీలు రజిత, ఖలీల్, శ్రీనివాస్ రెడ్డి, టిపిఎస్ ఏర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- **రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ :**





శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ హైస్కూల్లో జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షత కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్యశారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ అన్నిటికన్నా గొప్పదానం విద్యాదానం అని, సమాజంలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం ఉందని ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విద్యార్థులను ప్రభావితం చేస్తాయన్నారు. విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తిని పెంపొందించే విధంగా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శిక్షణలు నేర్చుకున్న నైపుణ్యాలను తరగతి గదిలో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి దోహదపడేలా చూడాలన్నారు. విద్యాబోధనే కాకుండా క్రీడలలో కూడా విద్యార్థుల నైపుణ్యాలను వేలికి తీసి వారిని రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ క్రీడాకాలుగా తయారు చేయాలన్నారు. తమ ప్రభుత్వం మాత్రం విద్య వ్యవస్థకు పెద్దపీట వేస్తుందని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు చేపడుతోందని అన్నారు. విద్యార్థుల వసతి గృహాల డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీల పెంచిందని అన్నారు.

కుల మతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించుటకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ లను ఏర్పాటు చేస్తున్నట్లు అందులో భాగంగా ఉర్సు కరిమాబాద్ లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైద్రాబాద్ లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్ష ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సెంటర్ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ జగ్గారెడ్డి

- **జననేత ఈటలకు క్షమాపణ చెప్పాలి**
- **బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రదీప్‌రావు**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**



ఈటల రాజేందర్ అనే వ్యక్తి ప్రజల చేత 7 సార్లు ఎన్నుకోబడి జనం మెచ్చిన నాయకుడిగా నిలిచాడని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. గురువారం ఓ సిటీ లోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతి, అక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే జవాబు ఇవ్వలేక జగ్గారెడ్డి అనేటోడు పదవి కోసం విచ్చలవిడిగా నోటికి ఏది వస్తే అది మాట్లాడడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. జగ్గారెడ్డి ఏమైనా బుద్ధి ఉందా..టీపీసీసీ పదవి కోసం రేవంత్ రెడ్డి ని ఎన్ని మాటలు అన్నావో నీకు గుర్తుందా.. అదే ఇప్పుడు పదవి కోసం రేవంత్ రెడ్డి మెప్పుకోసం ఇలాంటి వ్యాఖ్యలు మా నాయకుడి మీద చేస్తే నిన్ను బయట తిరుగనీయకుండా చేస్తాం..ఖబర్దార్ జగ్గారెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఈటల రాజేందర్ మీద మరోసారి పిచ్చి పిచ్చి వ్యాఖ్యలు చేస్తే నాలుక చీరేస్తామంటూ హెచ్చరించారు. ఇది ఇలా ఉంటే దేశమంతా యుద్ధ వైపు చూస్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరిమణులకు కోసం ఏర్పాట్లు చేస్తున్నది. కానీ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చిరు వ్యాపారుల వ్యాపార సముదాయాలను కాంగ్రెస్ పార్టీ ధ్వంసం చేస్తూ వారి పొట్ట గొడుతూ వారి ఉపాధిని సర్వనాశనం చేయడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఇలాంటి పనులను ప్రోత్సహించకూడదని తెలిపారు. స్థానిక మంత్రి పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తూ ఏ మంత్రం చలనం లేకుండా నియోజకవర్గంలో పట్టించుకోకుండా మంత్రి పదవిని, పోలీస్ బలగాలని ఉపయోగించుకుంటూ వారి సొంత పనులకు వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు,ఆరూరి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్,బిజెపి సీనియర్ నాయకులు కొరబోయిన రాజ యాదవ్, మంద ఐలయ్య, నరహరి వేణుగోపాల్ రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి,కాలి ప్రసాద్, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్ షా,తాబేటి వెంకట్ గౌడ్, మల్లాడి తిరుపతి రెడ్డి, అల్లం నాగరాజు, తదితర బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్ల సమస్యల పరిష్కారానికి కృషి..

- **ఎంపీ డా.కడియం కావ్య**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



ట్రాన్స్ జెండర్లు ఆత్మగౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హంటర్ రోడ్ లోని నాని గార్డెన్స్ లో ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చౌదరి బిరుదాంకిత కార్యక్రమానికి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి చర్యలు చేపడతామన్నారు. ట్రాన్స్ జెండర్ల ఆరోగ్యంతో పాటు వారికి అందాల్సిన పథకాల విషయంలో తన సహకారం ఉంటుందని ఎంపీ తెలియజేశారు. ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు, పేరు మార్చుకోవాలని అనుకుంటే చేయవలసిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉమెన్ ఎంపవర్మెంట్ కార్యక్రమంలో మహిళా సమస్యలతో పాటు ట్రాన్స్ జెండర్ల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలియజేశారు. ఈ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరికి సర్వ అధికారాలు హక్కులు ఉంటాయన్నారు. ట్రాన్స్ జెండర్ల సంఘానికి గుర్తింపు రావాలి అంటే ఎక్కడైతే వెనుకబడుతామే అక్కడే మీ గుర్తింపును పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని అప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. 2019లో ట్రాన్స్ జెండర్ యాక్ట్ అనేది వచ్చిందన్నారు. మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పార్లమెంట్ స్థాయిలో మీ గురించి మాట్లాడి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నల్గొండ జిల్లాల జోగినిలు పాల్గొన్నారు.

## ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతాం..

- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వేద న్యూస్, హన్మకొండ :**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా అభివృద్ధి చేపడుతానని వరంగల్ పశ్చిమ నియోజవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం 10వ డివిజన్ కాపువాడా పిటీసీ పాఠశాల ఆవరణలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.25 లక్షలతో అంతర్గత రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తనాజీ వాకాడే తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలానిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. శితిలావస్థలో ఉన్న పాత భవనాన్ని కూల్చి వేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి బస్తీ/కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, సైడ్ డ్రైన్, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు కూడా అధికారులకు సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ నాసిమ్ జాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, నాయకులు మామిడిశెట్టి సతీష్, పల్లం రమేష్, బొంత రామకృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో త్రాగు నీటి సమస్యపై మిషన్ భగీరథ,ఆర్ డబ్ల్యుఏస్, ఎలక్ట్రికల్, అధికారులతో పాటు సిమెంట్ ఇండస్ట్రీస్ మేనేజ్మెంట్స్‌తో కలసి గ్రామస్థుల సమక్షంలో సమావేశం అయిన శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. వాడపల్లి గ్రామంలో పరిసర ప్రాంతాల్లో త్రాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ప్రత్యేక పైప్ లైన్స్ ఏర్పాటు చేసి త్రాగు నీటిని అందించాలని అధికారులను సూచించారు. అలాగే గ్రామస్థులతో మాట్లాడి కరెంట్ సమస్యల గురించి అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో త్రాగునీటి కోసం పైప్ లైన్స్,మోటార్స్ ఏర్పాటు చేయడంతో పాటు శివాలయం,లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాల పరిసరాలలో పార్కింగ్ కోసం స్థలాన్ని పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయాలని, నిరుపేద కుటుంబానికి వివాహ శుభకార్యాలకు ఉపయోగపడేలా పరిసరాలను శుభ్రం చేసి ఏర్పాటు చేయాలని అంబుజా సిమెంట్స్ యాజమాన్యానికి సూచించారు. అలాగే ప్రసిద్ధి చెందిన మరో దేవాలయం గంగమ్మ తల్లి దేవాలయం పరిసరాలలో కూడా పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయించాలని వారికి సూచించారు. ప్రజా పాలనలో ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులనే తమ దగ్గరకి తీసుకొని వచ్చాము అని అన్నారు. మేము నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని నియోజకవర్గంలో ఎలాంటి సమస్య వచ్చినా మేము ముందుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073